సాక్షి
ములుగు
బుధవారం । 8 । అక్టోబర్ । 2025



తెగులు..దిగులు

రైతులకు సిరులు కురిపించే పసుపు పంటకు అధిక వర్షాల కారణంగా తాటాకు తెగులు ఆశించిందని, నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. - 8లో▸



పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0°/22.0°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డీడీకి సన్మానం



ఏటూరునాగారం: ఏటూరునాగారం ఐటీడీఏ డీడీగా పదవీ బాధ్యతలను స్వీకరించిన దబ్బగట్ల జనార్దన్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్స్‌లు సన్మానించారు. గతంలో పనిచేసిన డీడీ పోచం బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో జనార్దన్ విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఓ సారయ్య, ఏసీఎంఓ కోడి రవీందర్, స్పోర్ట్స్ ఆఫీసర్లు యాలం ఆదినారాయణ, వజ్జ నారాయణ, చుంచు కొమ్మాలు, ఆలం శ్యామలత, సిద్దబోయిన వెంకన్న, పీఈటీలు తాటి సతీష్, చింత రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



ములుగు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయ్‌పై ఓ లాయర్ దాడిని ఖండిస్తూ మంగళవారం ములుగు కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. దాడిని నిరసిస్తూ విధులకు హాజరుకాలేదు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వేణుగోపాలచారి, వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, సారంగపాణి, సుధాకర్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ భూమిలో పండ్లమొక్కల పెంపకం



ఏటూరునాగారం: మండలంలోని చిన్న బోయినపల్లి అటవీశాఖ భూమిలో అధికారుల ఆదేశాల మేరకు పండ్ల మొక్కలను నాటించామని ఎఫ్ఆర్ఓ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎఫ్ఆర్ఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అటవీశాఖ ఆధీనంలో ఉన్న భూమిలో పండ్ల మొక్కలను నాటి అర్హులైన రైతులకు ఫలసాయం చేసేందుకు తాము ప్రయత్నిస్తున్నామన్నారు. అటవీశాఖ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడడమే తమ బాధ్యతనన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను వివరించాలి



ఏటూరునాగారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఇంటింటికీ వివరించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గెలిపించి కేసీఆర్, కేటీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



చిట్యాల: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మల్లేష్ అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపూర్‌తండాలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ గ్రామంలో గంజాయి, గుట్కా, గుడుంబా అమ్మినా, కొత్త వ్యక్తులు కనబడినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెప్పారు. ప్రతి వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అన్నారు. డయల్ 100, షీ టీమ్స్, సీసీ టీవీ కెమెరాలపై అవగాహన కల్పించారు. అనంతరం నాలుగు బృందాలుగా ఏర్పడి 110 ఇళ్లను తనిఖీ చేయగా ఎనమిది వాహనాలకు సరైనా ధృవపత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు చెప్పారు. 350 లీటర్ల గుడంబా పానకం ధ్వంసం చేశారు. పది లీటర్ల గుడుంబాను సీజ్‌చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌లే దిక్కు!



జిల్లాలో గాడి తప్పుతున్న విద్యావ్యవస్థ

- 10 మండలాలకు కరువైన అధికారులు
- ఎంఈఓలుగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు
- అదనపు బాధ్యతలతో సతమతమవుతున్న హెచ్‌ఎంలు
- పర్యవేక్షణ లేక పక్కదారి పడుతున్న నిధులు

ములుగు: జిల్లా విద్యాశాఖకు ఇన్‌చార్జ్ అధికారులే దిక్కయ్యారు. రెగ్యులర్ డీఈఓ, ఎంఈఓలు లేకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతోంది. నాణ్యమైన విద్యతోనే విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతోంది. అలాంటి విద్యాశాఖ ఇన్‌చార్జ్‌ల పాలనలో కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాల్సిన జిల్లా విద్యాశాఖాధికారి పోస్టుతో పాటు ఎంఈఓల పోస్టులు కూడా ఇన్‌చార్జ్ పాలనలోనే కొనసాగుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ లేక నిధులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని 10 మండలాల పరిధిలో 337 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 16,883 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

నాలుగు నెలల్లో నలుగురు డీఈఓలు..

ములుగు డీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న పాణిని జూన్ 16న లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు. దీంతో హనుమకొండ డీఈఓ వాసంతికి జూన్ 17న జిల్లా డీఈఓగా అదనపు బాధ్యతలు ఇస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఆమె విధుల్లో చేరలేదు. ఇంటర్ విద్యాశాఖ అధికారిణి చంద్రకళకు ఇన్‌చార్జ్ డీఈఓగా బాధ్యతలు అప్పజెప్పడంతో ఆమె కొద్దిరోజులు మాత్రమే విధులు నిర్వహించింది. సెప్టెంబర్ 1న ములుగు ఇండస్ట్రీయల్ మేనేజర్‌గా కొనసాగుతున్న సిద్దార్థరెడ్డికి ఇన్‌చార్జ్ డీఈఓగా నియమించారు. నాలుగు నెలల్లో ముగ్గురు డీఈఓలు మారగా ప్రస్తుతం సిద్దార్థరెడ్డి ఇన్‌చార్జ్ డీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రెగ్యులర్ ఎంఈఓలు లేకపోవడంతో..

జిల్లాలోని 10 మండలాలకు రెగ్యులర్ ఎంఈఓలు లేకపోవడంతో పాఠశాల విద్యావ్యవస్థ గాడి తప్పుతోంది. ములుగు, మల్లంపల్లి మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా మల్లంపల్లి హైస్కూల్ హెచ్‌ఎం తిరుపతి విధులు నిర్వహిస్తున్నారు. వెంకటాపురం(కె) మండలానికి ఆదే మండల కేంద్రంలోని హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ, వాజేడు మండలానికి వెంకటాపురం(కె) మండలంలోని రాంచంద్రాపూర్ స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, తాడ్వాయి మండలానికి మంగపేట మండలంలోని కమలాపురం హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్, మంగపేట మండలానికి హెచ్‌ఎం మేనక, గోవిందరావుపేటకు హెచ్‌ఎం దివాకర్, కన్నాయిగూడెంకు హెచ్‌ఎం సాంబయ్య, వెంకటాపురం(ఎం)కు హెచ్‌ఎం ప్రభాకర్, ఏటూరునాగారంకు హెచ్‌ఎం మల్లయ్య ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో విద్యాశాఖ పనితీరుపై ప్రతీ ఏటా తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. విద్యాశాఖకు ప్రభుత్వం కేటాయించే నిధుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపణలున్నాయి. జిల్లాలోని ప్రతీ పాఠశాలకు స్కూల్ గ్రాంట్, కాంప్లెక్స్ నిర్వహణకు కాంప్లెక్స్ గ్రాంట్, ఎంఆర్‌సీ నిర్వహణకు ఎమ్మార్సీ గ్రాంట్,

వెల్లువెత్తుతున్న ఆరోపణలు

పీఎంశ్రీ పాఠశాలలకు ప్రత్యేక నిధులు మంజూరవుతాయి. పాఠశాలలకు కేటాయించిన నిధులపై ఉన్నతాధికారులకు పట్టింపులేకపోవడంతో ఆ నిధులు దుర్వినియోగమవుతున్నట్లు విమర్శలున్నాయి. గత జూన్ నెలలో డీఈఓ పాణినితో పాటు జూనియర్ అసిస్టెంట్ దిలీప్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడడం అవినీతి ఆరోపణలకు మరింత బలం చేకూర్చాయి. తమకు అనుకూలమైన పాఠశాలలో డిప్యుటేషన్ కావాలని వెళ్లిన ఉపాధ్యాయుల నుంచి జిల్లా విద్యాశాఖలో వివిధ విభాగంలో ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఒక్కొక్కరి వద్ద రూ.25వేలు వసూలు చేశారని విద్యాశాఖలో బహిరంగంగానే చర్చ కొనసాగుతోంది. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వివిధ విభాగాలకు ఎన్నో ఏళ్లుగా ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తూ తిష్టవేసి ఉన్నారని, అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారి విద్యాశాఖను భ్రష్టు పట్టిస్తున్నారని సహచార ఉపాధ్యాయులే ఆరోపిస్తున్నారు. డీఈఓ కార్యాలయంలోని రెండు ల్యాప్‌టాప్‌లు మాయమవడం వెనుక సొంతశాఖ అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లాకు రెగ్యులర్ ఎంఈఓలతో పాటు డీఈఓను నియమించి విద్యాశాఖను బలోపేతం చేయకపోతే పదవ తరగతి ఫలితాలపై ప్రభావం పడడంతో పాటు విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుంది.

ఎంఈఓలుగా గెజిటెడ్ హెచ్‌ఎంలు

గెజిటెడ్ హెచ్‌ఎంలు ఎంఈఓల హోదాతో సమానం. ఎంఈఓలుగా పనిచేస్తున్నవారు హెచ్‌ఎంలుగా అదనపు బాధ్యతలు నిర్వహించాల్సిన అవసరం లేదు. ప్రతీ పాఠశాలపై ఎంఈఓల పర్యవేక్షణ ఉంటుంది. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. సిలబస్ త్వరగా పూర్తి చేసి జనవరి నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేస్తున్నాం.

- సిద్ధార్థరెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ

ఏటీసీలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

కలెక్టర్ దివాకర

ఏటూరునాగారం/వాజేడు: ఏటూరునాగారం, వాజేడు కేంద్రాల్లో నూతనంగా నెలకొల్పిన ఏటీసీ సెంటర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏటీసీ, వాజేడు ఏటీసీలను ఆయన పరిశీలించి పరికరాల పనితీరును తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు ఏటీసీలో చేరి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. శిక్షణ నాణ్యత, వృత్తి విద్య సదుపాయాల విస్తరణ, విద్యార్థుల ప్రాక్టికల్ నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. శిక్షణలో మరింత నాణ్యతగా బోధించాలని అధికారులు, ఇన్‌స్ట్రక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ జగన్ మోహన్‌రెడ్డి, వాజేడు ప్రిన్సిపాల్ శేఖర్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జగదీష్, ముదిన్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ టీఎస్ దివాకర

కలెక్టరేట్‌లో కొమురంభీం వర్ధంతి

ములుగు రూరల్: కొమురం భీం వర్ధంతి వేడుకలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ టీఎస్ దివాకర కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురంభీం ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డిప్యూటీ కలెక్టర్ కుశీల్ వంశీ, కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, పర్యవేక్షలు మహేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ములుగు రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని టీఎస్‌జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడి చైతన్య అన్నారు. ఈ మేరకు మంగళవారం కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన క్రీడాకారుల అభినందన సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ స్థాయి అండర్ 19 క్రికెట్‌లో పాల్గొన్న పాలకుర్తి రేవంత్‌గౌడ్, జూడోలో ప్రతిభ కనబరిచిన హార్థిక్‌గౌడ్‌లను ఆమె శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌడ విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ప్రతిభావంతులను కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండబోయిన రవిగౌడ్, పులి నర్సయ్య గౌడ్, శ్రీనివాస్, మానస, సత్యనారాయణ, మధుకర్, శోభన్, శ్రీధర్, సదయ్య, రాంబాబు, రఘు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ములుగు రూరల్: జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాలలో పారా మెడికల్ డీఎంఎల్‌టీ, డీఎంఎస్ఓటీటీ కోర్సులకు ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు 2025-26 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ప్రభుత్వ వైద్య కళాశాలలో రూ.100 దరఖాస్తు రుసుం చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని స్వర్ణకుమారి సూచించారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 175 కొనుగోలు కేంద్రాలు
- కలెక్టర్ టీఎస్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ఏటూరునాగారం: నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ దివాకర అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(కె), తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులతో సమీక్ష సమావేశం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలన్నారు. జిల్లాలో దాదాపు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 175 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి షా ఫైజల్ హుస్సేని, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాంపతి, జిల్లా సహకార అధికారి సర్దార్‌సింగ్, అధికారులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు: అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ

గోవిందరావుపేట/ఎస్ఎస్‌తాడ్వాయి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ అన్నారు. మంగళవారం తాడ్వాయి రైతువేదికలో తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో రైతులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రాల్లో గన్నీ సంచులు అవసరానికి అనుగుణంగా సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు సెంటర్‌లో కనీస వసతులు మంచినీరు, టెంట్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ ప్రతీ రోజు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపే విధంగా ప్రణాళిక ప్రకారం లారీలను, హమాలీలను సిద్ధంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీనివాస రావు, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి ఫైజల్ హుస్సేనీ, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మేనేజర్ రాంపతి, జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్, అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకులో బుస్..బుస్



పామును బయటకు తీసుకువెళ్తున్న పాషా

మంగపేట: మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంకులో పాము కలకలం సృష్టించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంకు సిబ్బంది రోజు వారీగా ఉదయం 10 గంటలకు విధులకు హాజరయ్యారు. ఈ క్రమంలో ఉద్యోగి బాలరాజు ఓచర్లు తీస్తున్న క్రమంలో పక్కనే పాము (జర్రిపోతు) కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. విషయాన్ని సిబ్బందికి చెప్పి అందరూ బ్యాంకు నుంచి బయటకు వచ్చారు. బ్యాంకు పనిపై వచ్చిన వారిని లోపలికి వెళ్లకుండా తలుపులు వేసి మేనేజర్‌కు స మాచారం ఇచ్చారు. ఆయన వెంటనే గ్రామానికి చెందిన యాకూబ్ పాషా (పాములపాషా)కు సమాచారం అందించగా.. పాషా వచ్చి పామును పట్టి బయట వదిలేశాడు. దీంతో సిబ్బంది, వినియోగదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో గంట పాటు బ్యాంకు సేవలు నిలిచిపోయాయి.

రామాయణం మార్గదర్శక గ్రంథం

భూపాలపల్లి: మహర్షి వాల్మీకి రచించిన రామాయణం ప్రతీ మనిషి జీవితానికి మార్గదర్శక గ్రంథమని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. పర్గత్ దివస్‌ను పురస్కరించుకొని వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి చూపిన సత్యం, ధర్మం, కర్తవ్యమార్గాలు నేటి సమాజానికి ప్రేరణ అని కొనియాడారు. ఆధ్యాత్మిక, నైతిక విలువలను మనమందరం జీవితంలో అనుసరించాలని సూచించారు.

బలమున్న చోట బరి గీసి..!

- 'స్థానిక' ఎన్నికల్లో పొత్తులు.. కాంగ్రెస్‌తో 'కామ్రేడ్'లు ముందుకు
- నాలుగు జెడ్పీటీసీ స్థానాలపై గురి... ఎంపీటీసీ, సర్పంచ్‌లకూ పోటీ



సాక్షిప్రతినిధి, వరంగల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి నడిచేందుకు కామ్రేడ్‌లు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బలమున్న చోట పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనలు చేశారు. ఉమ్మడి వరంగల్‌లో ఆరు జెడ్పీటీసీ స్థానాల పేర్లను సూచించిన సీపీఐ నేతలు అందులో నాలుగు తప్పకుండా ఇవ్వాలన్న డిమాండ్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ముందుపెట్టారు. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కెళ్లపెల్లి శ్రీనివాస్‌రావు తదితరులు టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డిలతో మంగళవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ ఎన్నికల్లోనూ పొత్తులతో ముందుకు సాగాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో రాష్ట్ర వ్యాప్తంగా తమకు బలమున్న చోట పోటీ చేస్తామని సీపీఐ నేతలు చెప్పినప్పటికీ.. ప్రత్యేకంగా ఉమ్మడి వరంగల్‌లో జెడ్పీటీసీ సీట్ల కేటాయింపుపై చర్చ జరిగినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి (ఎస్సీ-జనరల్), వరంగల్‌లో నల్లబెల్లి (బీసీ-జనరల్)లను ఇవ్వాలని సీపీఐ ప్రతినిధుల బృందం కాంగ్రెస్ నేతలకు ప్రతిపాదించింది. మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్ (బీసీ-జనరల్), నెల్లికుదురు (బీసీ-జనరల్)లలో ఏదేని ఒకటి, జనగామ జిల్లాలో రఘునాథపల్లి (బీసీ-మహిళ), జఫర్‌గఢ్ (బీసీ-జనరల్)లలో ఒకచోట జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు ఛాన్స్ ఇవ్వాలని కోరారు. ఇక ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల విషయంలో సీపీఐకి బలమున్న చోట స్థానిక నాయకత్వంతో సమన్వయం చేసుకుని అభ్యర్థులను సూచిస్తామని కాంగ్రెస్ నేతలతో స్పష్టం చేసినట్లు తెలిసింది. కాగా బుధవారం ఉమ్మడి వరంగల్‌కు చెందిన సీపీఎం పార్టీ నేతలు కూడా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, వేంనరేందర్ రెడ్డిలను పొత్తుల విషయంలో కలవనున్నారన్న చర్చ కూడా జరుగుతోంది.

ఫారెస్ట్ చెక్‌పోస్టు పునరుద్ధరణ



కాటారం: కాటారం మండలకేంద్రానికి సమీపంలో జాతీయ రహదారిపై గతంలో ఏర్పాటు చేసిన ఫారెస్ట్ చెక్‌పోస్టును మంగళవారం నుంచి పునరుద్ధరించారు. కొంతకాలంగా చెక్‌పోస్టు నిర్వహణలో లేకపోవడంతో అక్రమ కలప రవాణా, ఇతరత్రా అసాంఘీక కార్యక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతూ వచ్చాయి. దీంతో అటవీశాఖ ఉన్నతాధికారులు చెక్‌పోస్టు నిర్వహణపై దృష్టిసారించి తిరిగి ప్రారంభించారు. కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ డాక్టర్ ప్రభాకర్, డీఎఫ్ఓ నవీన్‌రెడ్డి చెక్‌పోస్టును ప్రారంభించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టు ద్వారా ఇసుక లారీల నుంచి సెస్ ఫీజు వసూలు చేయనున్నట్లు సీసీఎఫ్ తెలిపారు. అక్రమ రవాణాపై నిరంతర నిఘా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ సందీప్, మహదేవపూర్ రేంజర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

డైలీవేజ్ కార్మికుల వంటావార్పు



వంట చేస్తున్న కార్మికులు, నాయకులు

ఏటూరునాగారం: గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో డైలీవైజ్ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె 26వ రోజుకు చేరింది. మంగళవారం మండల కేంద్రంలో సమ్మె శిబిరం వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ నాయకుడు దావూద్ మాట్లాడుతూ డైలీవేజ్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పనిలోకి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, భాగ్యలక్ష్మీ, జయలక్ష్మీ, సత్యం, ఊకే సమ్మక్క, విజయలక్ష్మీ, రాజు, సమ్మయ్య, సూర్యతేజ, ఇందిరా, సుమలత, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికులకు పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

ములుగు రూరల్: ఆర్టిజన్ కార్మికులకు పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఎల్లప్పుడు పని చేస్తుందన్నారు. ఆర్టిజన్ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తూ మానసిక ఒత్తిడికి చేయడం సరికాదన్నారు. అనంతరం డివిజనల్ విద్యుత్‌శాఖ అధికారి నాగేశ్వర్‌రావును కలిసి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ బొల్లి వెంకట్‌రాజ్, నాయకులు నలువాల స్వామి, భాస్కర్, శ్రీనివాస్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

యూరియా వచ్చేసింది..

ఖిలా వరంగల్: వరంగల్ గూడ్స్ షెడ్‌కు మంగళవారం యూరియా వచ్చింది. ఆర్సీఎఫ్ యూరియా 1,319.220 మెట్రిక్ టన్నులు, క్రిప్కో యూరియా 1,321.20 మెట్రిక్ టన్నులు చేరుకుంది. ఆయా కంపెనీల రికార్డు ప్రకారం ఏఓ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో మార్క్‌ఫెడ్‌కు 60శాతం, ప్రైవేట్ ఫర్టిలైజర్ డీలర్లుకు 40శాతం కేటాయించినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఆటో, గూడ్స్ ఢీ..

- మహిళ దుర్మరణం


శ్రీమతి(ఫైల్)

బయ్యారం: ఆటో, గూడ్స్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని పందిపడె సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కురవి మండలం సూదనపల్లికి చెందిన తాటిపాముల శ్రీమతి(55), భిక్షపతి దంపతులు కొంత కాలంగా జగత్‌రావుపేటలో నివసిస్తున్నారు. ఈ క్రమంలో మిల్లులో ధాన్యం పట్టించేందుకు ఆటోలో బయ్యారం వస్తున్నారు. బయ్యారం నుంచి రామచంద్రాపురం వైపున వెళ్తున్న గూడ్స్ వాహనం ఎదురుగా ఢీకొంది. దీంతో డ్రైవర్ పక్కసీటులో కూర్చున్న శ్రీమతి తీవ్రంగా గాయపడడంతో మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆటో డ్రైవర్ వీరన్నకు గాయాలు కాగా మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లిని చంపిన కేసులో కుమారుడికి జీవిత ఖైదు


నేరస్తుడు రాజుకుమార్

మొగుళ్లపల్లి: తల్లిని చంపిన కేసులో కుమారుడికి జిల్లా సెషన్స్ జడ్జి సీ.హెచ్. రమేశ్ బాబు జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. వంద జరిమానా విధించినట్లు ఎస్సై బొరగాల అశోక్ మంగళవారం తెలిపారు. మండలంలోని కొర్కిశాల గ్రామానికి చెందిన అప్పం సమ్మక్క, రాజుకుమార్ తల్లీకుమారులు. తోబుట్టువులను మంచిగా చూసుకుంటూ తనను పట్టించు కోవడం లేదని, తల్లిని చంపితే ఆస్తి మొత్తం తనకే వస్తుందనే ఉద్దేశంతో రాజుకుమార్ 2024 జూలై 26న రోకలిబండతో తల్లిని కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సమ్మక్క చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి చిన్న కుమారుడు అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం చార్జ్‌షీట్ దాఖలు చేసి రాజుకుమార్‌ను కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యధారాలు పరిశీలించిన మేజిస్ట్రేట్.. నేరస్తుడు రాజుకుమార్‌కు జీవితఖైదు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

చీడపీడల నివారణపై అవగాహన పెంచుకోవాలి

- వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు గీతారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గీతారెడ్డి

ఖిలా వరంగల్: చీడపీడల నివారణపై రైతులు మరింత అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు గీతారెడ్డి అన్నారు. మంగళవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ (సీఏబీఐ) సహకారంతో కోఆర్డినేటర్ అరుణ జ్యోతి అధ్యక్షతన ఆధునిక డిజిటల్ వ్యవసాయ విధానం, చీడీపీడల యాజమాన్యంపై శిక్షణ నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమయానుసారంగా సాంకేతిక సమాచారాన్ని రైతులకు చేరచేయడం అత్యంత కీలకమన్నారు. ఏఓలు, ఏఈఓలు డిజిటల్ యాప్‌ల వినియోగంపై పూర్తి అవగాహన పెంచుకుని రైతులకు పురుగుల మందుల వినియోగంపై మార్గ నిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, మధు మంజరి, డాక్టర్ అనీఫా, నర్సింగం, పాల్గొన్నారు.


తెగులు.. దిగులు





తాటాకు తెగులు సోకిన పసుపు పంట, పుచ్చుపట్టిన దుంప, దుంప తొలుచు ఈగ సోకిన పసుపు దుంప, ఆకుమచ్చ తెగులు సోకిన పసుపు పంట

- పసుపు పంటకు మూడు నెలలు కీలకం..
- ఆకుమచ్చ, దుంపకుళ్లుతో పంటకు తీవ్ర నష్టం
- జాగ్రత్తగా ఉండాలి
- రైతులకు వరంగల్‌జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసరావు సలహాలు



దుంప తొలుచు ఈగ..

➤ ఈగ పిల్ల పురుగులు తెల్లరంగులో బియ్యం గింజల మాదిరి ఉండి భూమి లోపల ఉన్న దుంపల్లోకి చొచ్చుకుని వెళ్లి దుంపను తిని నాశనం చేస్తాయి. ఈ పురుగు వల్ల సుడి ఆకు దాని దగ్గరలో ఉండే లేత ఆకులు వాడి గోధుమ రంగుగామారి ఎండి రాలుతాయి. ముచ్చును పీకితే సులభంగా ఊడి వస్తుంది.

నివారణ..

- ఈ పురుగు లక్షణాలు కనిపిస్తే ఎకరాకు 100 కిలోల వేపపిండిని మొక్కల మొదళ్ల వద్ద వేయాలి. వేప పిండి వేయడానికి వీలుకాకపోతే 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను 10 కిలోల ఇసుకలో కలిపి ఎకరం భూమిలో సమంగా చల్లాలి.

దుగ్గొండి: పసుపు.. పచ్చ బంగారం. రైతులకు సిరులు కురిపించే పంట. అయితే కొన్ని సంవత్సరాలుగా గిట్టుబాటు కావడం లేదు. మద్దతు ధర లేకపోవడం, దిగుబడి రాకపోవడంతో అన్నదాతలు నష్టాల పాలవుతున్నారు. గతేడాది వరంగల్ జిల్లా వ్యాప్తంగా 9 వేల ఎకరాలలో పసుపు పంట సాగుకాగా ఈ సారి 6 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఈ క్రమంలో విస్తీర్ణం తగ్గిన కారణంగా పసుపుకు అధిక ధర దక్కే అవకాశం ఉందని, రైతులు పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరావు సూచించారు. అధిక వర్షాల కారణంగా పసుపులో తాటాకు తెగులు, ఆకుమచ్చ, దుంప పుచ్చు, దుంప ఈగ తెగుళ్లు ఆశించాయని, వెంటనే అన్నదాతలు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పసుపు పంటకు అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

తాటాకు తెగులు..

➤ ఆకులపై అండాకారపు పెద్ద మచ్చలు ఏర్పడుతాయి. మచ్చలు గోధుమ రంగులో ఉండి మచ్చ చుట్టూ పసుపు రంగు వలయం ఏర్పడుతుంది. తెగులు ఉధృతి ఎక్కువయినప్పుడు ఆకుల పండు బారి ఎండి రాలుతాయి.

నివారణ..

- తెగులు సోకిన ఆకులను తుంచి దూరంగా తీసుకెళ్లి కాల్చాలి.
- లీటర్ నీటికి మిల్లీలీటర్ ప్రాఫికొనజోల్, గ్రాము కార్బండిజమ్ మందులకు 0.5 మిల్లీలీటర్ల సబ్బు నీరును కలిపి ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ తెగులు..

➤ ఆకులపై చిన్న మచ్చలు ఏర్పడుతాయి. పసుపు రంగు మచ్చలు కాస్తా గోధుమరంగులోకి మారి ఆకులు వడలి రాలుతాయి.

నివారణ..

- కార్బండిజమ్ లీటర్ నీటికి గ్రాము, ప్రాఫికొనజోల్ లీటర్ నీటికి మిల్లీలీటర్ కలిపి ఆకుల తడిచేలా పిచికారీ చేయాలి.

దుంప కుళ్లు..

➤ పసుపు చేనులో ముదురు ఆకులు వాడి గోధుమరంగుకు మారి ఎండి రాలుతాయి. తెగులు ఎక్కువతే ముదురు ఆకుల నుంచి లేత ఆకులకు వ్యాప్తి చెందుతుంది. కాండం గోధుమ రంగుకు మారుతుంది. తల్లికొమ్ములు, పిల్ల దుంపలు కుళ్లి మెత్తబడుతాయి. తెగులు సోకిన దుంపలను పరిశీలిస్తే లోపల పసుపు రంగుకు బదులు మట్టిరంగు కనిపిస్తుంది.

నివారణ..

- దీనికి విత్తనశుద్ధి కీలకం. లీటర్ నీటికి 3 గ్రాముల రెడోమిల్, 2 మిల్లీలీటర్ల మోనోక్రోటోపాస్ మందు కలిపిన నీళ్లలో 30 నిమిషాలు నానబెట్టి ఆ తర్వాత ఆరబెట్టి మళ్లీ లీటర్ నీటికి 5 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి కలిపిన మందులో అరగంట సేపు నానబెట్టి ఆరబెట్టి విత్తాలి. తెగులు సోకిన మొక్కల వద్ద లీటర్ నీటికి 3 గ్రామాలు రెడోమిల్ గాని, కాపర్ ఆక్సీక్లోరైడ్ గాని కలిపి మొక్క మొదలు వద్ద భూమి తడిచేలా పోయాలి.

జేఎన్ఎస్‌లో కబడ్డీ ఎంపికలు


ఎంపికలకు హాజరైన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్: పాఠశాల క్రీడల సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–19 బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నరెడ్ల శ్రీధర్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన బాలుర నుంచి 12 మంది, బాలికల నుంచి 12 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.డి. అజీజ్ ఖాన్, డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్, డీఐఈఓ ఎ. గోపాల్, ప్రభుత్వ వ్యాయామ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దరిగె కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు బరుపాటి గోపి, కోట సతీష్, రఘువీర్, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ముగ్గురు అధ్యాపకులు


సదాశివ్ చిర్ర రాజు రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్: తమిళనాడులోని మదురై కామరాజు యూనివర్సిటీలో ఈనెల 9,10,11తేదీల్లో 'విశ్వర్షి వాసిలి వాఙ్మయం దృక్పథాల ఆవిష్కరణ' అనే అంశంపై జరగనున్న అంతర్జాతీయ సదస్సులో ముగ్గురు కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకులు పాల్గొననున్నారు. కేయూ తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కర్రె సదాశివ్, డాక్టర్ చిర్రరాజు, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ తెలుగు విభాగం పార్ట్‌టైం లెక్చరర్ డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్ పాల్గొని ఆయా అంశాల్లో పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు.

విషజ్వరాలతో ముగ్గురి మృతి

విషజ్వరాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం ముగ్గురు మృతి చెందారు. వాజేడులో నర్సింగ్ విద్యార్థిని, నెక్కొండ మండలం గుండ్రపల్లిలో చిన్నారి, లింగాలఘణపురం మండలం మాణిక్యాపురంలో యువకుడు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.


అంజలి(ఫైల్)

వాజేడు: జ్వరంతో ఓ నర్సింగ్ విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం వాజేడులో చోటు చేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జాక మదనయ్య, రాజేశ్వరి దంపతుల కూతురు అంజలి(18) ఖమ్మంలో నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. దసరా సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చిన అంజలికి జ్వరం వచ్చింది. దీంతో స్థానికంగా వైద్యం చేయించినా తగ్గకపోవడంతో ఏటూరునాగారం తరలించారు. అక్కడా నయం కాకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సుమారు రూ. 70 వేల వరకు ఖర్చు చేశారు. మరో రూ. 3 లక్షల వరకు ఖర్చు అవుతుందని, అయినా బతుకుతుందని నమ్మకంగా చెప్పలేమని వైద్యులు తెలిపారు. దీంతో వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా పరీక్షించిన వైద్యులు జ్వరంతో పాటు కామెర్లు ఉన్నాయని, కిడ్నీలు, లివర్ పై ప్రభావం పడిందని నిర్ధారించి చికిత్స చేస్తుండగానే మృతి చెందింది.

గుండ్రపల్లిలో చిన్నారి..


సహస్ర (ఫైల్)

నెక్కొండ: అనారోగ్యంతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని గుండ్రపల్లిలో జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాండ్ల మౌనిక, అనిల్‌కుమార్ దంపతులకు కుమార్తె సహస్ర (9), కుమారుడు ఉన్నారు. నాలుగు రోజుల క్రితం సహస్రకు జ్వరం రావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు చిన్నారి గుండె బలహీనంగా ఉన్నట్లు గుర్తించి చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. దీంతో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మాణిక్యాపురంలో యువకుడు..


మహేశ్ (ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురం గ్రామానికి చెందిన రాగం రాంనర్సయ్య, పూలమ్మ దంపతుల కుమారుడు మహేశ్ (23) మంగళవారం విష జ్వరంతో మృతి చెందాడు. వారం క్రితం మహేశ్‌కు విష జ్వరం రావడంతో తల్లిదండ్రులు జనగామలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కాగా, ప్లేట్‌లెట్స్ 20 వేలకు పడిపోవడంతో తమ కుమారుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

కూతురు తీరుతో మనస్తాపానికి గురై..

- తండ్రి ఆత్మహత్యాయత్నం

తొర్రూరు: కూతురు తీరుతో మనస్తాపానికి గురైన తండ్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దుబ్బతండాకు చెందిన ఓ యువతి అదే తండాకు చెందిన యువకుడిని ప్రేమించింది. గమనించిన తండ్రి కూతురుకు మాటేడు తండాకు చెందిన సోదరి కుమారుడితో వివాహం జరిపించాడు. అయితే ఆ యువతి.. ప్రేమికుడితోపాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పెళ్లి జరిపించాలని పోలీసులను కోరింది. వారు యువతికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా తనకు ప్రేమించిన వ్యక్తితో పెళ్లి జరిపించాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చిన తల్లిదండ్రులకు స్పష్టం చేసింది. ఈ విషయంలో కుమార్తె తీరుతో మనస్తాపానికి గురైన తండ్రి పోలీస్ స్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగేందుకు యత్నించాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్సై ఉపేందర్ వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు అందిందని విచారణ చేపడుతామన్నారు.

అప్పుల బాధతో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి..


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న ఐలయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: అప్పుల బాధతో ఘన్‌పూర్‌కు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి బోసు ఐలయ్య మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఐలయ్య 1990 నుంచి 2013 వరకు ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేశాడు. 2016 నుంచి స్థానిక బస్టాండ్‌లో వెహికల్ పార్కింగ్ నడుపుతున్నాడు. కాగా నాలుగు నెలల క్రితం లీజును రద్దు చేసుకున్నాడు. అయితే ఐలయ్య చెల్లించిన అడ్వాన్స్‌లో రెండు నెలల కిరాయి పోగా ఆర్టీసీ నుంచి దాదాపు రూ.1.50లక్షలు రావాల్సి ఉంది. అలాగే, బస్టాండ్‌లో పలు కాంట్రాక్టు పనులు చేశాడు. అందుకు సంబంధించిన రూ.4 లక్షలు రావాల్సి ఉంది. ఈ విషయమై పలుమార్లు ఆర్ఎం, డీఎం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఈ క్రమంలో దాదాపు రూ.8 లక్షలు అప్పులు కావడంతో తీర్చే మార్గం లేక స్థానిక రిజర్వాయర్ వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించగా వారు వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించారు.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య


వేయిస్తంభాల దేవాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని, అధికారులు

హన్మకొండ కల్చరల్/ హన్మకొండ చౌరస్తా: ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని తన కార్యాలయంలో పురావస్తుశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని చారిత్రక ఆలయాలు, కాకతీయ వారసత్వ సంపదను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. వేయిస్తంభాల దేవాలయంలోని కల్యాణమండపం మరమ్మతులు, విగ్రహప్రతిష్ఠాపన, భద్రకాళి దేవాలయం, చిల్పూరులోని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధి, భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నైన్‌పాక ఆలయం, కోటగుళ్లు, రెడ్డిగుడి ప్రత్యేక శిలలపై నిర్మితమైన ఆలయాల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే, వరంగల్ కోటలో ఉన్న 14 ఆలయాల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం పురావస్తుశాఖ అధికారులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి వేయిస్తంభాల దేవాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్కియాలజిస్ట్ సూపరింటెండెంట్ నిహిల్ దాస్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రోహిణి పాండే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చట్టం ప్రకారం 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలి

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి


అవగాహన కార్యక్రమంలో వీసీ, రిజిస్ట్రార్, పరిపాలన అధికారులు

కేయూ క్యాంపస్ : రాజ్యాంగం ప్రకారం సమాచారం పొందడం ప్రతీ భారతీయ పౌరుడి ప్రాథమిక హక్కు అని, సమాచార హక్కు చట్టం ప్రకారం పౌరులు అడిగిన సమాచారం 30 రోజులలోపు ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయం నుంచి మంగళవారం ఆన్‌లైన్‌లో అన్ని యూనివర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్లు, పరిపాలన అధికారులు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు సమాచారం హక్కుచట్టంపై అవగాహన కల్పించారు. కేయూ నుంచి వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం, 'లా' కళాశాల డీన్ ఎం. శ్రీనివాస్, వివిధ పరిపాలన అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ పౌరులు అడిగిన సమాచారం 30 రోజులలోపు ఇవ్వకపోతే సంబంధిత అధికారులు రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమిషన్‌కు బాధ్యులవుతారన్నారు. 2005నుంచి సమాచారహక్కు చట్టం అమల్లోకి వచ్చిందని, దీనిని కచ్చితంగా అమలుచేయాల్సిందే అన్నారు.

మూడేళ్ల తర్వాత రైతుబీమా సొమ్ము

- పుట్టిన తేదీ తప్పుగా ఉందని నిలిపివేసిన అధికారులు
- వినియోగదారుల ఫోరం తీర్పుతో మృతురాలి కుటుంబానికి ఊరట


న్యాయవాది ప్రవీణ్

చిల్పూరు: జిల్లా వినియోగ దారుల ఫోరం తీర్పును సవాల్ చేసి రాష్ట్ర ఫోరం ఆదేశంతో బాధితురాలి కుటుంబానికి రూ. 5 లక్షలు బీమా సొమ్ము అందింది. అడ్వకేట్ రాచకొండ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు కొలిపాక యాదమ్మ 2022లో చనిపోయింది. రైతు బీమా డబ్బుల కోసం దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తులో యాదమ్మ పుట్టిన తేదీని ఆధార్ కార్డు ప్రకారం 1975గా నమోదు చేశారు. కానీ, రైతు బీమా పాలసీ బాండ్‌లో 1963, జనవరి 01 అని తప్పుగా అప్పటికే నమోదైంది. ఆమె చనిపోయే నాటికి 60 ఏళ్లకు పైగా ఉండడంతో బీమా సొమ్ము రూ. 5 లక్షలు అందకుండా పోయాయి. దీంతో కుటుంబ సభ్యులు హనుమకొండకు చెందిన న్యాయవాది రాచకొండ ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించారు. కేసు పూర్వ పరాలను పరిశీలించిన ప్రవీణ్.. వరంగల్ జిల్లా వినియోగ దారుల ఫోరంలో 2023 ఫిబ్రవరిలో కేసు ఫైల్ చేశారు. దీనిపై ఆగస్టు 23న వినియోగ దారుల ఫోరం పథకం నిబంధనలను అనుసరించి రైతు పుట్టిన తేదీ వివరాలను ఆధార్ కార్డు ప్రకారమే పరిగణించాలని నిర్ణయించి మృతురాలి కుటుంబానికి రూ. 2 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలంటూ తీర్పు నిచ్చింది. తీర్పుతో సంతృప్తి చెందని ప్రవీణ్.. జిల్లా వినియోగ దారుల ఫోరం తీర్పును హైదరాబాదులోని రాష్ట్ర వినియోగదారుల ఫోరంలో సవాల్ చేశారు. అన్ని వివరాలను పరిశీలించిన రాష్ట్ర ఫోరం బాధిత కుటుంబానికి బీమా సొమ్మును పూర్తిగా చెల్లించేలా ఇటీవల తీర్పునిచ్చింది. ఈకేసులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఎల్ఐసీ, లింగంపల్లి గ్రామ ఏఈఓలను ప్రతి వాదులుగా చేర్చుతూ ఆరు వారాల్లో సొమ్మును అందజేయాలని చెప్పింది. ఈ తీర్పుతో ఆ కుటుంబానికి న్యాయం జరిగిందని న్యాయవాది ప్రవీణ్ హర్షం వ్యక్తం చేశారు. బీమా కోల్పోయిన ప్రతీ రైతుకు ఈ తీర్పు వర్తిస్తుందని తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం..

- పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపణ


ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉమాప్రసన్న

మహబూబాబాద్ రూరల్ : ఘర్షణ విషయంలో న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కేసు పెడితే పోలీసులు పట్టించుకోకపోగా తమపట్ల దురుసుగా ప్రవర్తించి అకారణంగా దూషించారని ఆరోపిస్తూ ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలను బాధితురాలు బొజ్జ ఉమాప్రసన్న విలేకరులకు వెల్లడించింది. జిల్లా కేంద్రంలోని బెస్తబజార్ ప్రాంతంలో నివాసం ఉండే బొజ్జ లక్ష్మణ్, తన బంధువు మల్లం వంశీకి మధ్య కొద్దిరోజుల క్రితం దుర్గామాత నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా ఘర్షణ జరిగింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఘర్షణ పడుతున్న వారిని సముదాయించి అక్కడి నుంచి పంపారు. ఈ విషయంపై టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ మహేందర్ రెడ్డి స్పందించి బాధితురాలు కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కేసు విచారణ నిమిత్తం పోలీసులు ఘటనాస్థలికి వచ్చి విచారణ చేయకుండానే బాధితురాలి కుటుంబీకులపై కేసు నమోదు చేశారు. ఈ చర్యతో తాను మనోవేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని బాధితురాలు పేర్కొంది. తాము ఎలాంటి తప్పు చేయలేదని, విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని, తాను చనిపోతే అందుకు పోలీసులే కారణమని ఆరోపిస్తూ సూసైడ్ నోట్ రాసింది. ఈ విషయంపై టౌన్ సీఐ మహేందర్ రెడ్డిని వివరణ కోరగా బొజ్జ ఉమాప్రసన్న కుటుంబీకులను ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని, ఆమె ఆరోపణలు అవాస్తవమని తెలిపారు.

పని విషయంలో తల్లి మందలించిందని..

- యువతి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి


సాహితి (ఫైల్)

దేవరుప్పుల : ఇంటి పని విషయంలో తల్లి మందలించడంతో ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకుయత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని నీర్మాలలో చోటుచేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజోజు నర్సింహచారి, లక్ష్మి దంపతుల కూతురు సాహితి(28) బీఎడ్ చదివింది. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. ఇటీవల స్వగ్రామానికి వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన ఇంటి పని విషయంలో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన సాహితి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు గమనించి హనుకొండ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. తండ్రి నర్సింహచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బంగారం విడిపిస్తానని మోసం..

- ఈ ఘటనలో వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ మహేందర్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్ : బంగారం విడిపిస్తానని నమ్మించి డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్‌లోని మణప్పురం గోల్డ్ లోన్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ వద్దకు కొద్దిరోజుల క్రితం బానోత్ కల్యాణ్ అనే వ్యక్తి వచ్చాడు. తన బంగారం వేరే బ్యాంకులో తాకట్టులో ఉందని, అక్కడ అధిక వడ్డీ చెల్లిస్తున్నానని, ఆ బంగారాన్ని విడిపించి మణప్పురంలో మార్టిగేజ్ చేసుకోవాలని అడిగాడు. కల్యాణ్ మాటలు నమ్మిన బ్రాంచ్ మేనేజర్.. బంగారం మార్టిగేజ్‌కు కావాల్సిన మొత్తం రూ.6.22 లక్షలు అతడి ఖాతాకు బదిలీ చేశారు. ఆ డబ్బు ద్వారా కల్యాణ్ బంగారం విడిపించకుండా తన అవసరాలకు వాడుకుని మోసం చేశాడు. ఈ ఘటనపై సదరు సంస్థ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కల్యాణ్‌ను అరెస్ట్ రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. సమావేశంలో టౌన్ ఎస్సై మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.